

# కొంటెవారు మా శ్రీమతిగారు

— కృష్ణజ

శ్రీమతి అ...ఆలు దిద్దుకునే రోజుల్లోనే మా అమ్మాయి 'రచయిత్రి' అయిపోవాలంటూ ... సంబరపడేదట వాళ్ళ అమ్మగారు. అదేనండీ మా అత్తగారు ఆండాళమ్మగారు.

తనలో వుండి పైకి రాకుండా అణగారి పోయిన రచయిత్రిని కనీసం తన కూతురు 'వంటి'లోనైనా చూసుకోవాలని ఆవిడ .. తాపత్రయ పడేదట.

తత్ఫలితంగానే మా శ్రీమతి ఎనిమిదో ఏట నుండే రచనలు చేయడం ప్రారంభించిందట.

ఇవన్నీ నేను మా అత్తగారి మీద ద్వేషంతో చెబుతున్నానను కుంటున్నారేమో... అబ్బే ... అదేమీ లేదు... మా శ్రీమతే నాతో స్వయంగా చెప్పింది.

అలా కథలు రాస్తూనే ఎదిగిందట మా శ్రీమతి. సదరు "రచయిత్రి వంటి"ని నేను మొదటి పెళ్ళి చూపుల్లోనే ప్రేమించడం, ఆ పైన పెళ్ళి చేసుకోవడం కూడా జరిగి పోయింది.

మా పెళ్ళయిన కొత్తల్లో కూడా అలా ఎడతెరిపి లేకుండా రాస్తూనే కూర్చునేది అర్ధరాత్రి వరకూ.

పెళ్ళాం గాలి మరీ కొత్తేమో... ఆ గాలి లేకుండా నాకు నిద్ర పట్టేది కాదు.

కథలూ-కాకరకాయలూ అంటూ బంగారం లాంటి కాలం వృధా చేస్తుంటే నిజం చెప్పొద్దూ, బయటికి చెప్పలేకా మింగలేకా కుతకుత లాడిపోయే వాడిని.

ఏమైనా అందామంటే, "అభివృద్ధి నిరోధకులైన భర్తలూ- వారి ఆగడాలూ" అనే శీర్షికతో నన్నూ పత్రికల కెక్కిస్తుందేమో అనే భయంతో, శ్రీమతి అర్ధరాత్రి రచనా వ్యాసంగాలకు ఎలాంటి ఆటంకమూ చెప్పేవాణ్ణి కాదు.

ఓ మాటా-మంతీ, పలుకూ-కులుకూ, కబుర్లూ-కాకరకాయలూ, సినిమాలూ-షికార్లూ, ప్రణయ కలహాలూ, అలకలూ, అట్లకాడ బెదిరింపులూ గట్రా-గిట్రా లేకుండా ... అలా రాసుకుంటూ పోతుంటే కట్టుకున్న (కట్టుబడిన) మొగుడు ఏమై పోతాడు చెప్పండి...?

నాకు కుత కుత లాడిందంటే ఆడదూ మరి... ఇలా రాత్రనకా పగలనకా శ్రీమతి చెమటోడ్చి సృష్టించిన రచనా రాజాలు ప్రియుడ్ని వదల్లేని ప్రియురాలిలా వెదుక్కుంటూ వచ్చి, "నీవు తప్ప నాకీ ప్రపంచంలో మరో చోటు లేదు" అన్నట్లు తిరుగు టపాలో వచ్చి శ్రీమతి ఒడిలోనే వాలేవి. అలా... అలా... తిరిగి వచ్చిన తన అపూర్వ సృష్టిని చూసి శ్రీమతి బిక్క మొఖం వేయడం, నేను పై పైకి ఓదార్చడం ... అదంతా ఓ పెద్ద సీను...

నిజం చెప్పొద్దూ... ఆ రోజు నాకు మహా సంతోషంగా వుంటుంది.

అలాగైనా విరక్తి చెందిన మా శ్రీమతి తన అపూర్వ రచనా వ్యాసంగానికి "గుడ్ బై..." చెప్పి వెన్నెల సాయంత్రాలూ, వణికించే చలి రాత్రులూ సద్వినియోగం చేస్తుందేమో... అని నా ఆశ.

అలాంటి సందర్భాల్లో దారిన పోయే ఏ దానయ్యనైనా పిలిచి కాఫీ, టిఫిన్ ఇప్పించి సంతోషం పంచుకోవాలనే నా కోర్కెను బలవంతంగా అణుచు కుంటు కుంటుంటాను... కారణం వాళ్ళు విశాఖపట్టణం నుండి పారిపోయి వచ్చానని భ్రమ పడతారేమో అని...

ఇదండీ ... పాత కథ.

అయితే అసలు కథంతా ఇప్పుడే జరిగింది.

ఆ రోజు సాయంత్రం ఆఫీసు నుండి ఇంటికి వస్తూ, పెద్ద మల్లె పూల పొట్లం, చిన్న చిరునవ్వూ, హుషారయిన ఈల పాటతో సహా ఇల్లు చేరాను.

ఆఫీసు పనితో అలసిపోయి ఉసూరుమంటూ ఇల్లు చేరే నాకు ఈ రోజు ఇంత హుషారుగా వుందంటే, వుండదూ మరీ... ఈ రోజు మా శ్రీమతి కథ తిరిగి వచ్చిందండీ. వెదుతూనే అలసటగా (నటన) కుర్చీలో కూలబడుతూ, దీనంగా కాఫీ అందిస్తున్న శ్రీమతిని చూసి "అలా వున్నావేం వంటీ...?" అని అడుగుతాను అతి ఆప్యాయంగా. శ్రీమతి జవాబు చెప్పకుండా మౌనంగా నేల చూపులు చూస్తుంటుంది.

"కథ తిరిగి వచ్చిందనేనా...? పోనీలే ఇంత మాత్రానికే ఇలా బెంబేలు పడితే ఎలా...? ఇప్పటి పెద్ద రచయిత్రులందరూ ఒకప్పుడు నీలాగే కథలు తిరిగి వచ్చిన వాళ్ళే... (ఈ లోపుగా బుజ్జగిస్తూ శ్రీమతిని దగ్గరగా తీసుకోడం) మళ్ళీ ప్రయత్నం చెయ్యి. విష్‌యూ బెటర్ లక్ నెక్స్ట్ టైమ్..."

ఈ లోపుగా శ్రీమతి పూర్తిగా నా ఒళ్ళోనే వుంటుందనే విషయం మీకు తెలీదు కదూ! ఆ తరువాత నా షర్టు గుండీలు సవరిస్తున్న శ్రీమతి జడలో పూలు తురమడం, అవి ఆఘ్రాణించే మిషతో ముందుకు వంగడం... అలా అలా... లలలా.

అయితే... గియితే ఇదంతా మీరను కున్నంత తేలిక కాదు సుమండీ...

తన కథ తిరిగి వచ్చినందుకు గాను తనతో పాటు నేనూ ఫీలౌతున్నట్లుగా నమ్మకంగా ముఖం పెట్టాలి.

లోపలి నుండి తన్నుకు వస్తున్న సంతోషాన్ని, దాని తాలూకు నవ్వునూ అతి జాగ్రత్తగా అదిమి పెట్టాలి. ఆ నవ్వు తాలూకు మెరుపు లేమయినా నా కళ్ళల్లో చదివిందంటే ఇక ఆ రాత్రి శివరాత్రే కదా...!

ఏమయినా గొప్ప "థ్రిల్లింగ్‌గా" వుంటుంది లెండి.

సరే... ఎంత వరకూ వచ్చాం...

ఇంటికి వచ్చానన్నాను కదూ!

అయితే నేనూహించినట్లుగా శ్రీమతి దిగులుగా, విచారంగా లేదు.


పై పెచ్చు నవ్వుతూ ఎంతో సంతోషంగా కనిపించింది. (నాకు తెలిసినంత వరకూ "మొదటి రాత్రి" కూడా అంత సంతోషంగా లేదేమో!)

నవ్వుతూ కాఫీ అందించింది.

కొంపతీసి ఏ కథైనా అచ్చు కాలేదు కదా!

కథ అడ్డం తిరిగినందుకు కాఫీ చేదుగా అనిపించింది.

"మరి... మరి ఓ శుభవార్త... చెబుతాను. నాకేమిస్తారూ...?" గారాంగా అడిగింది శ్రీమతి. తెలుగు



**మందు బాబులు**

'పార్వతి పోతే చంద్రముఖి వుందిగా, మనకేంటి బ్రదర్!" అంటున్నాడు మందుకొట్టి స్టేజి ఎక్కిన దేవదాసు పాత్రధారి తెర లేవగానే.

"ఇదేమి దేవదాసు నాటకం" అర్థంకాక ప్రక్క వ్యక్తిని అడిగాడు ఒక ప్రేక్షకుడు.

"అబ్బ, ఈ కాలం దేవదాసులే" వివ క్కున్నాడు పక్క వ్యక్తి చేతిలోని మందు బాటిల్ పైకెత్తుతూ.

—యలవర్తి జగన్మోహనరావు

సినిమాలు చూసీ, చూసీ, తెలుగు నవలలు చదివీ, చదివీ ఆ మాటలకు అర్థం మరోలా స్ఫురించి ఉలిక్కిపడ్డాను.

దాంపత్య జీవితపు లోతులలోని మధురిమలను ఇంకా అందుకోనే లేదు. అప్పుడే వేవిళ్ళ- పురిటి వాసనా... నా గొంతులో కాఫీ వుండగా ఘుట్కుని మింగుడు పడలేదు. అంతలో శ్రీమతి ఓ పత్రిక తెచ్చి ఎదురుగా వుంచింది. నేననుకున్నది కానందుకు నా మనస్సు ఊరట చెందింది. తెరచి వున్న పత్రికలో శ్రీమతి ఫొటో ముద్దు లొలుకుతూ కనిపించింది.

"నేనూ - మా శ్రీవారూ" శీర్షిక క్రింద.

"హౌడ్స్ స్వీట్" అంటూ గాలిలోకి ఓ ముద్దు విసిరేసి మాటర్ చూశాను.

"మా శ్రీవారు చాలా సహృదయులు. నా రచనా వ్యాసంగానికి ఆయన తన పూర్తి సహకార సానుభూతులు అందిస్తారు. అసలు నేనింత గొప్ప రచయిత్రిని కావడానికి కారణం మా శ్రీవారే. (ఇంత వరకూ ఒక్క కథా అచ్చు యూడకపోయినా!) అన్నట్లు, మా వారు చింతకాయ పచ్చడి అద్భుతంగా చేస్తారు. ఇంగువ తాలింపుతో శ్రీవారు చేసిన చింతకాయ పచ్చడి కోసం వీథిలోని వారంతా క్యూలో నించుంటారట. అలా అని మా వారే చెప్పారు. అంత గొప్ప భర్తను పొందిన నేను నిజంగా అదృష్టవంతురాలినని మురిసిపోతుంటాను.

రచయిత్రి

-"వంటి"

చదువుతోన్న నాకు కళ్ళు బైర్లు కమ్మడంతో పాటుగా ముచ్చెమటలు పోసి గొంతు తడారిపోయింది.

నేరకపోయి ఒకసారి శ్రీమతితో తన కంటే నేను వంట బాగా చేయగలననీ, వంట చెయ్యనని బెదిరించే అవకాశం తనకు లేదనీ, నేను చేసిన చింతకాయ పచ్చడి కోసం వీధి వీధంతా క్యూలో నిలబడేవారనీ కోశాను.

కానీ, ఇలా నన్ను వీథిలో నిలబెడు తుందని ఏ మాత్రం ఊహించి వున్నా... చ్చొ...చ్చొ...ప్చ్...ప్చ్... ఇప్పుడు ఏమనుకునీ ఏమిటి ప్రయోజనం...?

మా ఆఫీసు స్టాఫంతా నన్ను చింతకాయ పచ్చడి రుచ్చేందుకు పిలిస్తే ఏది దారి...?

ఓరి దేవుడోయ్... ఏమిటి చేయడం...? *

# అమ్మాయిల ప్రశ్నలు— అబ్బాయిల సమాధానాలు!





ఈ శీర్షికన వడ్డే సుశీల, (సికిందరాబాద్ పంపిన) "టీనేజ్‌లో అమ్మాయికి వుండాల్సిందీ, అబ్బాయికి వుండకూడనిదీ ఏమిటి మిస్టర్!?" అనే ప్రశ్నకి ఈ క్రింది జవాబుల్ని ఎంపిక చేశాము. వీటిలో అత్యుత్తమంగా భావించిన జవాబుకి బహుమతిని పంపే ఏర్పాటు చేస్తున్నాం.

ఈ శీర్షికకు అసంఖ్యాకంగా తమ జవాబులు పంపి విజయవంతం చేసిన పాఠకులకు మా అభినందనలు.

అయితే కొందరు అబ్బాయిలు అమ్మాయిలు తమ జవాబులతో పాటు ఫోటోల్ని జతచేయలేదు. ఈ సారి ఫోటోల్ని జతచేయని జవాబుల్ని పరిశీలించదలచలేదు. అంచేత ఈ శీర్షికకు జవాబులు వ్రాసే వారు తప్పక తమ ఫోటోలు జతచేయాలి. మరికొందరు పంపిన ఆసక్తికరమైన సమాధానాలను ఈ దిగువ పొందుపరుస్తున్నాం. ఈ సమాధానాలు పంపిన పాఠకులకు కూడా వారు ఊహించని బహుమతి పంపుతున్నాం.

ఆ సమాధానాలు—

**బహుమతి జవాబు**

**కేర్ - ఫ్రీ**

ఆడపిల్లకు వుండవలసింది 'కేర్', మగపిల్లవాడికి వుండకూడనిది 'ఫ్రీ' అని దీని అర్థం!

**విజేత:**

—అప్పన క్షీరసాగర్ మంగళగిరి.

ఆకర్షణ-వికర్షణ:

పి. పవన్ కుమార్, హన్మకొండ.



అమ్మాయికి 'S' వుండకూడదు- అబ్బాయికీ అంతే

(MR(s) MR:

ఎం.ఎ. ఖయ్యూం, నెల్లూరు.





రక్షణ-భద్రత

ఎం. విద్యాసాగర్, అనంతపూర్.




చాప

టి.ఎ. ప్రభాకర్, రాజమండ్రి

వోణి

పి. వెంకట నర్సయ్య, మెరకపాలెం.



ఎత్తు చెప్పులు-ఎత్తుపళ్ళు

పి. రమేష్, బొంబాయి.





ప్రేమ-భ్రమ

ఎ.డి. జయప్రకాశ్, మద్రాసు.



వ్యక్తిత్వం-వ్యామోహం

టి. నరసింహమూర్తి, విజయవాడ.

**ఈ వారం ప్రశ్న:**

ప్రశ్న : "నేను అందమైన అమ్మాయిని. నా అడ్రెస్ కనుక్కోండి" అని ఓ కొంటెపిల్ల ఫోన్ చేస్తే ...

పంపినవారు:—కాజ హనిత, ఏలూరు.



ఈ ప్రశ్నకి సమాధానం 5.-12-88 .తేదీ లోగా టీనేజ్ అబ్బాయిల నుంచి వారి ఫోటోలతో సహా పంపగోరతాం.

ఈ శీర్షికను సమర్పిస్తున్నవారు

Guys 'n' Dolls

FASHION SENATE

RAVI MANSION, BANDAR ROAD

LABBIPET, VIJAYAWADA - 10